# గురుదేవోభవ

పరాయి పరిపాలనా వెలుగును గుర్తుచేసుకునేటట్లు చేస్తున్న స్వాతంత్రపు చీకటిలా రాత్రి మొదలైంది మనుషులి వాళ్ళవాళ్ళ సంకుచిత మనస్తత్వాన్ని హేళన చేస్తున్నట్లు పక్షులు గళం చించుకుని అరుస్తున్నాయ్. రోహిణికార్తె తన ప్రభావాన్ని గాలిద్వారా తెలుపుతున్నట్లు వెచ్చగా వీస్తోంది...

కమలమ్మ గారు వీధివాకిట్లో కూర్చునుండి గాని ఆవిడకి మనస్సు మనస్సులో లేదు. అలా కూర్చుని ఎదురుచూసేది భర్త గౌరీపతి కోసమే అయినా, తీరా అతడొచ్చి విషయం తెల్సుకుని, దాల్చబోయేవుగ్ర రూపాన్ని వూహించుకొని భయపడసాగింది.

కిరణ్ పదేళ్ళవాడు, ఇంట్లో బిక్కు బిక్కు మంటూ కుర్చీలో ముడుచుక్కూరుచన్నాడు. ఎర్రని దేహచ్ఛాయ. వుంగరాల జుట్టు, అమాయకంగా, భయం భయంగా చూస్తున్నకళ్ళు. అతడు కూర్చున్న తీరు, ఎవరన్నా ఇంకో సమయంలో చూస్తే అతడిని ఎత్తుకుని ముద్దాడాలనిపిస్తుంది. కాని ఇపుడాపని కెవరూ సాహసించలేరు కారణం అతడు పలకరిస్తే వర్షించే మేఘంలా వున్నాడు.

అర్ధంలేని, అర్థంకాని నిశ్శబ్దానికి భయపడి మిగతా పిల్లలు రమ, రాణి బుద్ధిగా కాళ్ళు చేతులు దగ్గర పెట్టుక్కూర్చున్నారు. కమలమ్మగారి మస్తిష్కంలో అదే ప్రశ్న– విషయం తెల్సాక, ఆయనేం చేస్తారో–

గౌరీపతి, ప్రభుత్వ యంత్రాంగంలో చిన్న సీలలాంటి గుమాస్తాగిరి, పదహేనేళ్ళ క్రితం ఎక్కడపడ్డాడో సరిగ్గా అక్కడే వున్నాడు. అభివృద్ధిలేని బ్రతుకు శాంపలాంటి జీవితం. ఈ మధ్యకాలంలో అతడు సాధించింది అందమైన గుణవంతురాలైన భార్యని, ఆవిడ ద్వారా ముగ్గురు పిల్లలు– రత్నాల్లాంటి వాళ్ళు కాని గౌరపతికి వాళ్ళు రత్నాలు పొదిగిన గుదిబండల్లా కన్పిస్తారు. మధ్యతరగతనే మహామ్మారికి చిక్కి గిలగిల్లాడుతున్న అతడు కష్టాలని, సుఖాలని అంకెల్లో చూసుకోవటం నేర్చుకున్నాడు. అతడు ఆశావాదికాదు కానీ ఈ నిరాశావదికున్న ఒకే ఒక ఆశ– పిల్లలు ఒకే ఒక్క ఆలోచన– వాళ్ళ భవిష్యత్తు గూర్చి. వాళ్ళకి తాను ఆస్తిపాస్తులిచ్చేది ఎటూ లేదు గనుక మంచి చదువుల్చెప్పించి, వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడేలాచెయ్యాలని ఆరాటం.

అందుకే ఆరోజు...

ఫలానా స్కూల్లో సీటుకావాలంటే,పిల్లలకి వెయ్యి రూపాయల చొప్పున డొనేషనుకట్టాలని అతడన్నపుడు కమలమ్మగారు "అంత ఖరీదైన స్కూల్లో ఎందుకండీ, మామూలు వీధిబళ్ళో పడేద్దాం" అంది.

"చూడు– వాళ్ళకు మనం ఇవ్వబోయేది ఏమీ లేదు కనీసం చదువన్నా చెప్పించకపోతే ఎలా? అంతగా అయితే ఇంట్లో ఖర్చులే తగ్గించుకుందాం" అన్నాడు గౌరీపతి.

వారంరోజుల తర్వాత ముగ్గురు పిల్లలు రంగురంగు యూనిఫారమ్ ధరించి, నిగనిగలాడుతున్న బూట్లతో, చేతిలో పుస్తకాల డబ్బాలతో స్కూలుకు వెడుతుంటే చూసి అతడు మురిసిపోయాడు. ఆ రాత్రి తన కొడుక ఇంజనీరు, కూతుళ్ళు డాక్టర్లూ అయిపోయినట్లుగా కలగన్నాడు–

–కాని కమలమ్మ గారు, మాయమైన జత బంగారుగాజులను తుల్చుకుని, చేతికున్న మట్టిగాజులు హేళనచేస్తున్నట్టుగా ఊహించుకుని బాధపడింది.

సంఘంలో అట్టడుగు మనిషిగ్గూడా చదువుకునే అవకాశం కల్పిస్తామని ఏనాడు ప్రభుత్వం ప్రటించిందో ఆనాడే, సామాన్య మనిషి, చదువుగూడా అందరాని చందమామలా తనకి దూరం కానున్నదని గ్రహించాడు. సరిగ్గా అలాగే జరిగింది.

గౌరిపతి ముచ్చటపడి పిల్లల్ని అస్కూల్లో చేర్పించాడేగాని, నెలనెలా జీతాలు కట్టేటప్పుడు, అర్థంలేని ముడుపులు చెల్లిస్తున్నప్పుడు కొంచెం బాధపడ్డాడు. భయపడ్డాడు. కాని, వెంటనే 'ఇంకానయం– నేనదృష్టవంతుడిని, ముగ్గురు పిల్లలే! పాపం ఆరుగురు పిల్లలున్న వాళ్ళు ఆత్మహత్య చేసుకోవాల్సిందే'నని తనని తానే అభినందించుకునేవాడు.

విద్యని సామాన్య మనిషికి అందుబాటులో లేకుండా చేసి,తద్వారా భయపెట్టి, తక్కువ పిల్లల్ని కనేలా చెయ్యటం ప్రభుత్వ ఉద్దేశ్యమైతే, కుటుంబ నియంత్రణలో ఇదీ ఒక భాగమైతే, వారి పథకం బాగా అమలు జరుగుతోందనే చెప్పాలి.

కమలమ్మగారు మెల్లిగా లేచి వీధివైపు చూసింది కాని భర్త వస్తున్న జాడ కన్పించలేదు కిరణ్ అలాగే భయంగా ముడిచి

పెట్టుక్కూర్చున్నాడు మిగతా పిల్లలిద్దరూ ఏదో ప్రళయం రాబోతుందన్నట్లు భయపడి నిద్రాదేవి ఒళ్ళో దాక్కున్నారు.

కమలమ్మగారు నిద్రపోతున్న పిల్లలిద్దర్నీ పక్కలపైన చేరుస్తూ, కిరణ్‌తో– 'త్వరగా పట్టెడన్నం తిని, ఆయన రాకముందే పడుకో– పరీక్ష తప్పావని తెలిస్తే చంపేస్తారు' అంది.

ఆమాట వినగానే పసిగుండె భయంతో పరుగులు తీసింది. కదలలేక అలాగే కూర్చుండి పోయాడు. ఆవిడ కిరణ్‌ని రెక్కపట్టి చరచరా వంటగదిలోకి లాక్కెళ్ళి పడేసింది. "మొద్దువెధవా! సంవత్సరం పొడుగునా జీతాలు కట్టి, ప్రైవేటు పెట్టినా తప్పికూర్చున్నావ్" విసుక్కుంటూ కంచంవాల్సి అన్నం వడ్డించింది.

"తిను– తర్వగా తిని నిద్రపో"

మొగ్గలాంటి ఆ మనస్సులో వెయ్యి ప్రశ్నలు– లక్ష సందేహాలు కిరణ్ కంచంలో చెయ్యిపెట్టకుండానే–

"నేను అన్ని లెక్కలు బాగానే చేశానమ్మా! అన్నీ రైటని శేషు వాళ్ళన్నయ్య గూడా చెప్పాడు" అన్నాడు భయంగా.

"ఏడ్చావ్– వెధవబద్ధాలు నువ్వూను– అన్నీ సరిగ్గాచేస్తే ముప్ఫైరెండు మార్కులు ఎందుకొస్తాయ్? అయినా, నాకెందుకు ఆయనొచ్చి కనుక్కుంటారుగా" పిల్లాడు పరీక్ష తప్పాడన్న బాధకన్నా, భర్త గురించి భయం ఎక్కువగా అన్పించిందావిడకి దానికికారణం……

సరిగ్గా ఆర్నెల్లక్రితం–

ఒకరోజు సాయంత్రం పూట గౌరీపతి పిల్లల్ని కూర్చోబెట్టుకుని పాఠాలు చెప్తున్నాడు చరిత్ర పాఠం చెబుతూ, మధ్యలో కిరణ్‌ని 'మనదేశం రిపబ్లిక్ ఎప్పుడైంద'ని అడిగాడు. అతడు వెంటనే 'ఆగస్టు, పదిహేను, పందొమ్మిది వందల నలభై ఏడు సమాధానమిచ్చాడు.

గౌరీపతి ఒళ్ళుమండిపోయింది. కాని, సహనంగా, మళ్ళీ, "నేనడుతున్నది రిపబ్లిక్ గూర్చి" అన్నాడు.

"ఆగస్టు పదిహేను"

కిరణ్ చెంప చెళ్ళుమంది వంటగదిలో వున్న కమలమ్మగారు వులిక్కిపడింది.

'చెప్పు– రిపబ్లిక్ ఎప్పుడొచ్చింది"

కిరణ్ ఎర్రబడ్డ చెంపని తడుముకుంటూ కన్నీళ్ళనాపుకుంటూ "మా టీచరు అలాగే చెప్పింది నాన్నా– ఆగస్టు పదిహేను…"

"అబద్ధాలాడావంటే ప్రాణాలు తోడేస్తా టీచరు అలా ఎందుకు చెబుతుంది? తెలీదని మర్చిపోయానని చెప్పు"

కిరణ్‌కి ఏడుపాగిందికాదు– సన్నగా ఏడుస్తూ "నిజం నాన్నా– మా టీచరు అలాగే…."

కిరణ్ రెండో చెంప ఛెళ్ళుమంది.

గదిలోకొచ్చిన కమలమ్మగారు, పిల్లవాడిని దగ్గరకి తీసకుంటూ– "వాడినలా చంపక సమాధానం చెప్పకూడదూ" అంది నిష్ఠూరంగా.

"చెప్పటానిక్కాదు– మాటీచరు అలానే చెప్పిందని అబద్ధమాడేస్తున్నాడు. వెధవ"

'నిజంగానే అలానే చెప్పిందేమో?"

భర్త కోపానికి ఆనకట్టవెయ్యాలన్న ప్రయత్నంలో అన్నదేకాని, టీచరు అలా చెప్పుండదని ఆవిడకీ గట్టి నమ్మకం

కాని భార్య మాటవిని ఆలోచనలో పడ్డాడు గౌరీపతి.

ఆ మర్నాడు అతడు కిరణ్ వెంట స్కూలుకెళ్ళాడు. హెడ్‌మిస్ట్రెస్ సుకుమారిని కల్సుకున్నాడు. ఆవిడది మంచి అందమైన విగ్రహం. దానికితోడు కట్టుకున్న ఖరీదైన పట్టుచీర, చేతికి మూడుజతల బంగారు గాజులు, ఎడంచేతికి రిస్టువాచి, మరిన్ని సొగసులు సమకూర్చాయి కొద్దికాలం క్రితం వరకు, అంటే, ఈ స్కూలు వ్యాపారాన్ని ప్రారంభించకముందు, ఆవిడ సాధారణమైన చీరల్లో పసుపుతాడుతో తిరగటం గౌరీపతికి తెల్సు.

లోనికొచ్చిన అతడివంక ఏం కావాలన్నట్లు చూసింది.

"నా పేరు గౌరీపతి– ఇతడు మా అబ్బాయి మీ స్టూడెంటు" అన్నాడు గౌరీపతి కుర్చీలో కూర్చుంటూ.

ఆవిడ "అవునవును. మంచి తెలివిగల వాడు. వృద్ధిలోకొస్తాడు" అంది గొప్పగా. కాని అతడెందుకొచ్చాడో అర్థంకాక తన అందమైన కళ్ళతోనే ప్రశ్నించింది.

గౌరీపతి కాస్త వ్యంగ్యంగా పిల్లలు వృద్ధిలోకిరావాలనే తల్లితండ్రులు వాళ్ళ కడుపులు కట్టుకుని, వాళ్ళ అవసరాలని కాదని, జీతాలుకట్టి చదివిస్తారు. కాని, స్వాతంత్రమంటే ఏమిటో, రిపబ్లిక్కు అంటే ఏమిటో ఆ రెండింటికి గల తేడా ఏమిటో తెలీని వాళ్ళ చదువులని చూసి అభివృద్ధి అనుకోమంటారా'

సుకుమారికి అతడి ధోరణి అర్థం కాలేదు. తన అందమై విగ్రహాన్ని చూసి కూడా అతడలా మొహమాటం లేకుండా మాట్లాడటం ఆవిడకి బాధనిపించింది.

"మీరంటున్న దేమిటో నాకర్థం కావటం లేదు" అంది మెల్లిగా.

"రాత్రి మావాడిని, మనదేశం రిపబ్లిక్ ఎప్పుడయిందనడిగితే ఆగస్టు పదిహేను పందొమ్మిదొందల నలభై ఏడని సమాధానమిచ్చాడు.

ఆవిడ గౌరీపతి తీక్షణమైన చూపులనించి తప్పించుకుంటూ, "కిరణ్– అలాని చెప్పావా?" అనడిగింది.

కిరణ్ ఏమీ మాట్లాడలేదు.

మళ్ళీ గౌరీపతి "అలా చెప్పటమే కాకుండా పైగా మా టీచరు అలానే చెప్పిందని దబాయిస్తున్నాడు" అన్నాడు.

సుకుమారి మళ్ళీ ఏం కిరణ్– అలా అన్నావా?" అంది.

ఈసారి కిరణ్ మాట్లాడేడు. "అవును మా టీచర్ అలానే చెప్పింది" అన్నాడు ధైర్యంగా.

"తప్పు అలా అబద్ధాలాడకూడదు– టీచరు అలా ఎందుకు చెబుతుంది? మన దేశం జనవరి ఇరవై ఆరు, పందొమ్మిది వందల యాభైనాడు రిపబ్లికయింది తెల్సిందా. ఏది నాన్నగార్కి చెప్పు" అంది వయ్యారంగా.

గౌరీపతి కుర్చీలోంచి లేస్తూ "నాకేం చెప్పించనక్కర్లేదు. కానీ, మేం కడుతున్న ఫీజులకి, వాళ్ళు వెలగబెడుతున్న చదువులకి సాపత్యం కన్పించటం లేదు. ఇంకాస్త శ్రద్ధ తీసుకోవటం ఎంతయినా అవసరం" అనుకుంటూ బయటికెళ్ళిపోయాడు.

అతడటు వెళ్ళగానే, కిరణ్‌చేత, వాళ్ళ టీచరు పద్మావతిని పిలిపించింది సుకుమారి ఆవిడకి పాతికేళ్ళుదాకా వయస్సుంటుంది. బ్రతకలేక, నెలకో వందరూపాయల సంపాదనకి వేరే మార్గంలేక బడిపంతులుగా వచ్చినట్లుంది.

ఆవిడరాగానే సుకుమారే "టీచర్– మనదేశం రిపబ్లిక్ ఎప్పుడయింది" అని ప్రశ్నించింది.

ఆవిడ "ఏమిటలా అడుగుతున్నారు– ఆగస్టు పదిహేను...."

"నోర్ముయ్– అవస్థల్లో వున్నావని, సాటిదానివని ఉద్యోగం ఇస్తే, కనీస విషయాలు తెల్సుకోవాలన్న ఇంగితం కూడా లేదా? రిపబ్లిక్ జనవరి ఇరవై ఆరు, జనవరి–"

కిరణ్ తన నిజాయితీ రుజువయినందుకు సంతోషంగా సుకుమారివంక చూసేడు.

"ఏవిటి తమాషా చూస్తున్నావా? వెళ్ళు క్లాసుకి" అని విసుక్కోవటంతో మెల్లిగా కదిలాడు.

కాని ఆవిడ వాలకం మాత్రం బొత్తిగా అర్థంకాలేదు. అబద్ధాలాడొద్దని చెప్పే టీచర్లు అలా పబ్లిక్కుగా అబద్ధాలెందుకుతున్నారో కూడా అర్థం కాలేదు.

ఆ పసిమనస్సులో వెయ్యి ప్రశ్నలు.... లక్ష సందేహాలు. కిరణ్ కంచం ముందు కూర్చున్నాడేగాని, అన్నంముట్టలేదు. అతనికి అర్థంకానిదల్లా, తను అన్ని లెక్కలు సరిగ్గా చేసినా ముప్ఫైరెండు మార్కులు మాత్రమే వచ్చాయని.

కమలమ్మగారు తన పనుల్లో తనుంది, అంతలో తలుపు చప్పుడయింది.

వెంటనే ఆవిడ కంచం ముందుకూర్చున్న కిరన్‌ని రెక్కపట్టి లాక్కెళ్ళి మంచంపై పడేసి, దుప్పటికప్పుతూ, రహస్యంగా "కళ్ళు మూసుకుపడుకో" మని చెప్పి వెళ్ళి తలుపు తీసింది.

గౌరీపతి వుస్సూరుమంటూ లోనికొస్తూ భార్య మొహంలో ఆందోళన గమనించి ఏవిటన్నట్లు చూసేడు. ఆవిడ అప్పుడేం మాట్లాడక, తర్వాత భోజనం ముందు నెయ్యి వడ్డిస్తూ

"మన పిల్లలిద్దరూ పాసయ్యారండి అంది మెల్లిగా.

అతడిలో ఒక్కక్షణం ఆనందం– మరుక్షణంలో సందేహం.

"అంటే..."

"ఆడపిల్లలిద్దరూ పాసయ్యారు–"

"మరి–కిరణ్–"

కమలమ్మగారు ధైర్యాన్ని చిక్కబట్టుకుని "వాడికీ అన్నిట్లోను అరవైలు, డెభైలొచ్చాయ్. కాని ఒక్క లెక్కల్లోనే– ఆదీ ఎంత – వెధవది మూడు మార్కుల్లో–" అంది.

"అంటే లెక్కల్లో తప్పాడా?"

ఆవిడ మౌనంవహించింది– ఈ ఒక్క క్షణం దాటిపోతే రేపుదయానికింత కోపం వుండదని ఆవిడ ఆశ.

కాని ఆక్షణ అంత తేలిగ్గా దాటలేదు.

గౌరీపతికి చేతిలో ముద్దజారిపోయింది.

ఒక్కసారిగా కంచాన్ని ఆవలకినెట్టేసి లేచి నుంచున్నాడు. వెయ్యి పడగల తాచులా బుసలు కొడుతూ ముందుగదిలోకొచ్చాడు.

వెనకనించి కమలమ్మగారు "నిద్రపోతున్నాడండీ– తెల్లవారినాక కనుక్కోవచ్చు. అన్నం తినండి" బ్రతిమాలుతున్నట్లుగా అంటోంది. కాని అతడు వినేస్థితిలో లేడు.

పడుకున్న కిరణ్‌ని రెక్కబట్టి క్రిందకు దింపాడు.

కిరణ్ భయంతో ముడుచుకుపోయి, హిరణ్యకశిపుడి ముందు ప్రహ్లాదుడిలా అచేతనంగా నిల్చున్నాడు.

కమలమ్మ గారు ఆఖరి ప్రయత్నంలా "ఏవిటండీ మీరు మరీ రాద్ధాంతం చేస్తారు. వెధవ మూడు మార్కులు వచ్చుంటే వాడూ పాసయ్యేవాడే. అయినా అన్ని లెక్కలు రైటుగా చేశానని, సాయంత్రం నుంచి మొత్తుకుంటున్నాడు" అంది.

గౌరీపతి కోపంతో వూగిపోతూ "అంటాడు– అలానే అంటాడు. మొన్నటికి మొన్న అలాగే అబద్ధం చెప్పాడు, బాగా టక్కరి తనం అలవాటయింది వెధవకి" అంటూ చెంపని ఛెళ్ళుమనిపించాడు.

కిరణ్ వెళ్ళి దూరంగా పడ్డాడు "అన్ని లెక్కలు బాగానేచేసా నాన్నా, శేషు వాళ్ళన్నయ్యగూడా–"

గౌరీపతి శివతాండవం చేస్తున్న వాడిలా "అదిగో ఆ కూతే కుయ్యొద్దన్నాను. వెధవబద్ధాలు నువ్వూనూ. రాస్కెల్" అంటూ ఎడంకాలు గాలిలో ఒక్కసారిగా విసిరేడు–

అంతే

మరుక్షణం ఆ పసివాడు ప్రాణంకోసం పెట్టిన కేక–

కమలమ్మగారు పరుగుపరుగున రావటం– కిరణ్ కళ్ళుతేలేసి పడిపోవటం– ఆవిడ గుండెలు బాదుకుని ఏడ్వటం–

ఆస్పత్రిలో–

డాక్టరు ఇంజక్షన్ చేస్తూ "మర్మావయవం మీద బలమైన దెబ్బతాకింది– ఎలా జరిగింది?" అని ప్రశ్నించినపుడు–

కమలమ్మ గారు తలొంచుకుని "సాయంత్రం ఆడుకుంటూ గోడమీంచి క్రిందవున్న రాయిమీదపడ్డా"డని చెబుతున్నప్పుడు–

గౌరీపతిలో వెయ్యిజన్మల గిల్టు–

"నాన్నా కిరణ్– చూడు– ఒక్కసారి కళ్ళుతెరచి అమ్మా అనరా– నీమాట వినందే నేనన్నం ముట్టనురా– నన్నన్యాయం చెయ్యకురా–" అంటూ ఆవిడ కడుపుచించుకుంటున్నా, తనకేంపట్టనట్లు మూడు రోజుల తర్వాత, చీకటిపడేవేళ, రాక్షసులు నిద్రలేచేవేళ, కిరణ్ శాశ్వతంగా–

–కిరణ్‌పోయాక గౌరీపతి మౌనముద్ర దాల్చాడు. బాధవల్లకావచ్చు– కడుపు శోకంతో వున్న భార్యని, భర్తగా ఓదార్చాలో, క్షమించమని అడగాలో అర్థంకాక కావొచ్చు.

సరిగ్గా వారంరోజుల తర్వాత కిరణ్ పుట్టినరోజు–

అగ్నిలో ఆజ్యం– నిప్పుకి గాలి– కమలమ్మగారి బాధకి పరాకాష్ట.

గౌరీపతి ఆరోజు పిల్లలిద్దర్ని తీసుకుని స్కూలుకెళ్ళాడు. దారిలో అయిదు రూపాయల చాక్లెట్లు తీసుకున్నాడు.

సుకుమారి గౌరీపతిని వెంటనే గుర్తుపట్టింది. "చాలా తెలివైనవాడు బుద్ధిమంతుడు– ప్చ్– పాపం– అంతా డెస్టినీ–" ఓదార్పుగా అంది.

గౌరీపతి మెల్లిగా "ఈరోజు వాడి పుట్టిన రోజు. ఈ చాకెట్లు వాడి స్నేహితులకి పంచండి" అంటూ ప్యాకెట్టు నామెకిదించాడు.

ఆమె పద్మావతి టీచరుకోసం కబురంపి గౌరీపతితో "పిల్లలు వ్రాసిన పరీక్ష పేపర్లు వాళ్ళ పేరెంట్సుకి చూపుతూ పంపిస్తుంటాం కిరణ్ మొన్న వ్రాసిన పేపర్లు కావాలంటే తీసుకోండి" అంటూ కట్టపేపర్లని అతడి ముందుంచింది.

గౌరీపతి వద్దనబోయి, "నాన్నా, అన్ని లెక్కలు బాగా చేశాను శేషు వాళ్ళన్నయ్య గూడా..." అన్న కిరణ్ చివరి మాటలు గుర్తుకొచ్చి, చటుక్కున పేపర్లని

ముందుకులాక్కుని, ఆత్రంగా లెక్కల పేపరుకోసం వెతికాడు. కన్పించిన లెక్కల పేపరుని, దానిపై వేసున్న మార్కులని చూసి, పంజాదెబ్బ రుచి చూసిన వాడిలా, పిచ్చివాడిలా అరిచాడు.

సుకుమారి వులిక్కిపడి "ఏమైంది" కంగారుగా అడిగింది.

గౌరీపతి నిలువెల్లా వూగిపోతు 'లెక్కల్లో ఎన్ని మార్కులిచ్చారో చూడండి" వున్మాదిలా కేకలేసేడు.

కిరణ్‌కి పాతికలో పద్దెనిమిది– అంటే– నూటికి డెభైరెండు మార్కులొచ్చాయ్.

ఆ పేపరుని పరిశీలించిన సుకుమారి అవాక్కయింది. గౌరీపతి వంక భయంగా చూసింది.

"వాడికి డెభైరెండు మార్కులొస్తే, ప్రోగ్రెస్ రిపోర్టులో ముప్ఫైరెండు మాత్రమే వచ్చినట్టు, లెక్కల్లో తప్పినట్లు వ్రాశారు. అయ్యో... నేనెంత మూర్ఖుణ్ణి. అన్నీ సరిగా చేశానని మొత్తుకుంటున్నా...."గౌరీపతి టేబులుపై తలవాల్చి భోరుమనడ్వనారంభించాడు.

సుకుమారికి భయం ఎక్కువయింది. ప్రక్కనే నిలబడ్డ పద్మావతి వంక అసహ్యంగా చూసింది కానీ, ఆచూపుల్ని ఆవిడ మరోలా అర్థం చేసుకుని, "నేను పాతిక్కి ఎనిమిదేననుకున్నాను సారీ" అంది.

ఆమాట విన్న గౌరీపతి చటుక్కున లేచాడు. కోపంతో, బాధతో, అసహ్యంతో "సారీ... అన్న రెండక్షరాలతో మీరు చేసిన పాపం కడిగేసుకుంటున్నారు కాని, మీరు చేసిన తప్పుకి శిక్షమాకు పడింది. మా కడుపుల్లో వాడు పెట్టిన ఈచిచ్చు, మీ తప్పుకి గుర్తుగా రగుల్తూనే వుంటుంది. మా కిరణ్ చావలేదు– చంపబడ్డాడు. అర్థంలేని ఆంక్షలతోను, క్రమశిక్షణ పేరుతోను కాల్చుకుతిన్న నేను, విద్యని వ్యాపారం చేసి, ప్రగతిని విజ్ఞానంలో కాక, బ్యాంకు బాలస్సుతో చూసుకుంటున్న మీరు, అందరం కల్సి వాడిని చంపేశాం. మనం– మనం– హంతకులం" అంటూ తిరిగి మొహాన్ని చేతుల్లో దాచుకుని ఘొల్లుమన్నాడు.

చాక్లెట్సుకోసం వచ్చిన కిరణ్ స్నేహితులు ఆశ్చర్యంగా, భయంగా చూస్తున్నారు. నెర్వస్‌గా ఫీలవుతున్న సుకుమారి చేతిలో కిరణ్ లెక్కల పేపరు భావిపౌరుల భవిష్యత్తులా నలిగిపోతోంది.